క్లుప్తంగా

ఉత్తమ అవార్డు గ్రహీతకు సత్కారం



ఎంపీడీవో యాదగిరీశ్వరరావును సత్కరిస్తున్న ఉద్యోగులు

నాతవరం: ఉత్తమ అవార్డు గ్రహీత, ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావును శనివారం తన కార్యాలయంలో ఉపాధి హామీ పథకం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఘనంగా సత్కరించారు. రిపబ్లిక్‌డే సందర్భంగా జిల్లా కేంద్రంలో కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ ఉద్యోగిగా అవార్డు అందుకోవడం మండలానికే గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఏపీవో చిన్నారావు, ఏపీఎం మర్రిలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు

కోడి పందాలు ఆడిస్తున్న వ్యక్తి అరెస్టు

చోడవరం రూరల్: డబ్బులు పణంగా పెట్టి కోడిపందాలు ఆడిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన అందజేసిన వివరాల ప్రకారం మండలంలోని జన్నవరం గ్రామంలోని కళ్లాల వద్ద కోడిపందాలు ఆడిస్తున్నట్టు ముందస్తు సమాచారం ఉండడంతో సిబ్బందితో దాడి జరపగా గ్రామానికి చెందిన శీరం తాతబాబు కోడిపందాలు ఆడిస్తుండగా అరెస్టు చేసి, అతని వద్ద నుంచి రెండు కోడిపుంజులు, 350 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి అరెస్టు చేసామన్నారు.

శారదా నది వంతెన పరిశీలన



దేవరాపల్లి వంతెనను పరిశీలిస్తున్న సీపీఎం నాయకుడు మధు

దేవరాపల్లి: దేవరాపల్లిలో శారదానదిపై వంతెనను సీపీఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ రాజ్యసభ సభ్యుడు పి. మధు శనివారం పరిశీలించారు. వంతెన అప్రోచ్ రోడ్డు పనులను తక్షణమే పూర్తి చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. అనంతగిరి మండలంలోని చాలా గ్రామాలకు రోడ్డు సదుపాలయం లేదన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్న, అల్లూరి జిల్లా సీపీఎం కార్యదర్శి పి. అప్పలనర్స తదితరులు ఉన్నారు.

కోడి పందాలాడుతున్న నలుగురి అరెస్టు

మాకవరపాలెం: కోడిపందాలు ఆడుతున్న నలుగురిని అరెస్టు చేశామని ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు. మండలంలోని జెడ్.గంగవరం గ్రామ శివారులో శనివారం పందాలు ఏర్పాటు చేసినట్టు సమాచారం అందిందన్నారు. దీంతో సిబ్బందితో దాడి చేసి నలుగురిని పట్టుకుని, వారి వద్ద నుంచి రూ.800 నగదు, రెండు కోళ్ల స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు.

దేవాలయాల నిర్మాణానికి రూ.9 కోట్లు



ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: నియోజకవర్గంలో 90 దేవాలయాల నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం నిధులనుండి ప్రభుత్వం రూ.9 కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పేర్కొన్నారు. నర్సీపట్నం మండలం, ధర్మసాగరంలో టీటీడీ నిధులతో చేపట్టిన శ్రీకృష్ణుడు ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఆలయ శంకుస్థాపనకు విచ్చేసిన ఎమ్మెల్యేకు గ్రామ సర్పంచ్ గొంప కన్నయ్య నాయుడు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. మండల పార్టీ అధ్యక్షుడు సుర్ల సత్యనారాయణ, ప్రముఖ వైద్యుడు డాక్టర్ లక్ష్మీకాంత్, యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోనా గురవయ్య, సర్పంచ్ బంటు నాగరాజు, పార్టీ నాయకుడు ఇన్నం రమణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే సంక్షేమం.. జగనన్నకే సాధ్యం

● 'గడప గడప' కు కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి



వృద్ధురాలిని అక్కున చేర్చుకున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు

మాడుగుల: దేశంలో ఎక్కడా లేని విధంగా ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. శనివారం మండలంలోని జంపెన గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో 585 బుక్‌లెట్లను లబ్ధిదారులకు అందజేసి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. ముందుగా గ్రామానికి చెందిన మహిళలు పూలమాలలు వేసి హారతులు పట్టి జై జగన్, జై బూడి అంటూ నినదించారు. బూడి గ్రామంలోని సీతారాముల వారిని దర్శించుకుని ఇంటింటికీ పర్యటించారు. పెచ్చేటివారి కళ్లాల వద్ద పశువుల తాగునీటి కోసం రెండు బోర్లు మంజూరు చేశారు. గ్రామానికి చెందిన నిరుపేద మహిళ దాసరి దేవి కుమార్తెను రెసిడెన్షియల్ పాఠశాలలో చేర్పిస్తానని హామీ ఇచ్చారు. ప్రాథమిక పాఠశాలలో సుమారు రూ. 15లక్షలతో జరిగిన నాడు-నేడు పనులను పరిశీలించి అదనపు భవనం మంజూరుకు హామీ ఇచ్చారు. గ్రామానికి చెందిన కోన జగ్గమ్మతో పాటు మరో పది మంది మహిళలు జగనన్న సంక్షేమ పథకాలతో బంగానం అమర్చుకున్నామన్నారు. 53 మందికి జగనన్న ఇళ్లు మంజూరు చేశారు. కోన ఘాటీలు కళ్లాలకు రోడ్డు నిర్మాణానికి హామీ ఇచ్చారు. అంగవైకల్యంతో బాధపడుతున్న 9 సంవత్సరాల బాలుడికి దివ్యాంగ పింఛన్ అందజేయాలని అధికారులను ఆదేశించారు. నడవ లేని స్థితిలో ఉన్న పాతాల పరదేశమ్మ, వానపల్లి పైడితల్లమ్మను అక్కున చేర్చుకుని, ఒకే కార్డులో ఉన్నందున ఒకరికి పింఛన్ రాకపోవడంతో కార్డులు వేరు చేసి పింఛన్లు అందజేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. స్థానిక దళిత వాడలో ఏర్పాటు చేసిన భారతరత్న అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీలు తాళ్ళపురెడ్డి వెంకటరాజామ్, ఎంపీటీసీ తలారి అప్పారావు, సర్పంచ్ గురువునాయుడు, జెడ్పీటీసీ కిముడు రమణమ్మ, మాడుగుల సర్పంచ్ ఎడ్ల కళావతి, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు శేనాపతి కొండలరావు, బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, జేడీపేట సర్పంచ్ కొసిరెడ్డి కృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ నాయకులు ఇందుకూరి నాగరాజు, కోరుకొండ చెల్లంనాయుడు, తాళ్ళపురెడ్డి రాంబాబు, కాళ్ళరాము, ఆదారి కన్నారావు, విస్సారపు రామారావు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్



నాడు-నేడులో నిర్మించిన అదనపు గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఉమా శంకర్ గణేష్

నాతవరం: రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో గెలిపించేందుకు అంతా ఆశీర్వదించాలని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ అన్నారు. మండలంలో చమ్మచింత గ్రామంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి నవరత్నాలపై వివరించారు. గ్రామంలో నాడు నేడు పథకంలో రూ. 23 లక్షల 50 వేలతో నిర్మించిన అదనపు భవనాలను ప్రారంభించి విద్యార్థులతో ముచ్చటించారు. ఆయనను పాఠశాలలో ఘనంగా సత్కరించారు. చమ్మచింత పంచాయతీని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మైనం వెంకట భాస్కర్, వైస్ ఎంపీపీ మైనం శ్రీనాగగోపి అభీష్టం మేరకు అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. రాష్ట్రానికి 30 ఏళ్ల పాటు సీఎంగా జగనే ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలోఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, వైస్ ఎంపీపీలు పైల సునీల్, మైనం శ్రీనాగగోపి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శెట్టి నూకరాజు, గన్నవరం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి గొర్లే వరహాలబాబు, ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ చైన్లు, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యులు ఉలబాల శ్రీను, సబ్బవరపు వెంకునాయుడు, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్, రజాక్, జేతలు జోగారావు, రాజేష్ జయరాజ్, శ్రీవెంకటేశ్వరమ్మ, చంద్రమౌళి, ఎంఈవో తాడి అమృత్‌కుమార్, ఉపాధి హామీ పథకం ఏపీవో చిన్నారావు, చమ్మచింత సర్పంచ్ వెలకాడ కొండబాబు, మిరపల వెంకటరమణ, గుడపర్తి అచ్చియ్యనాయుడు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గంగరాజు పాల్గొన్నారు.

పశు వైద్యశాల నూతన భవనం ప్రారంభం

నాతవరం: గ్రామంలో పశు వైద్యశాల నిర్మించడం రైతులకు ఉపయోగకరమని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అన్నారు. మండలంలోని చమ్మచింత గ్రామంలో రూ. 26 లక్షల 50 వేలతో నిర్మించిన పశువైద్యశాల నూతన భవనాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ నాతవరం మండలంలో వ్యవసాయం తర్వాత అధికంగా పాడిపరిశ్రమపై రైతులు ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. ఈప్రాంతంలోని పశువులు, గొర్రెలకు ఎలాంటి రోగం వచ్చినా ఇక్కడ వైద్య సేవలు పొందవచ్చన్నారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మైనం వెంకటభాస్కర్, వైస్ ఎంపీపీలు పైల సునీల్, మైనం శ్రీనాగగోపి, సర్పంచ్ వెలకాడ కొండబాబు, ఉప సర్పంచ్ అప్పన దివాణం, ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ రజాక్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శెట్టి నూకరాజు, వ్యవసాయాధికారి శైలజ పాల్గొన్నారు.

నాటు సారాతో వ్యక్తి అరెస్టు

చోడవరం రూరల్ : పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆటో స్టాండ్ దగ్గర నిషేధిత నాటుసారా కలిగి ఉన్న సమాచారం మేరకు ఎస్ఐ బి.అప్పలనాయుడు తనిఖీలు జరిపి 14 లీటర్ల నాటుసారాతో దుంగా దేవుడు అనే వ్యక్తిని అరెస్టు చేసినట్టు సీఐ శ్రీనివాసరావు చెప్పారు. చీడికాడ మండలం తురువోలు గ్రామానికి చెందిన దేవుడు వద్ద నుంచి నాటుసారాను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో పుడమికి మేలు

దేవరాపల్లి: పచ్చి రొట్ట ఎరువుకు బదులు 30 రకాల విత్తనాలతో సాగు చేయడం ద్వారా భూమి సారవంతమవుతుందని మారేపల్లి సర్పంచ్ అవుగడ్డ కన్నతల్లి, ఎంపీటీసీ అవుగడ్డ రామదేవి అన్నారు. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ ప్రకృతి వ్యవసాయం (ప్రజల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయం)పై గ్రామంలోని రైతులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులు, ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అవుగడ్డ రామ్మూర్తినాయుడు, చిననందిపల్లి సర్పంచ్ పోతల చినమ్మలు, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ బి. అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

రూ.43 లక్షలతో జల్‌జీవన్ మిషన్ పనులు



ట్యాంక్ నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్వేత తదితరులు

కె.కోటపాడు : ఉగ్గినవలస గ్రామంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తీర్చేందుకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు రూ.43 లక్షల నిధులు మంజూరు చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అల్లు శ్వేత తెలిపారు. ఈ నిధులతో గ్రామంలో ప్రతి ఇంటికి కుళాయి నిర్మాణంతో పాటు 20 వేల లీటర్ల మంచి నీటి సామర్థ్యం గల ట్యాంక్ నిర్మాణం జరపనున్నట్లు ఆమె తెలిపారు. ట్యాంక్ నిర్మాణానికి అవసరమయిన స్థలాన్ని డీసీసీబీ డైరెక్టర్ చల్లా సత్యనారాయణమూర్తి సూచనల మేరకు గ్రామస్తులు సమకూర్చారు. ఈ స్థలాన్ని శనివారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్వేత, డీసీసీబీ డైరెక్టర్ చల్లా సత్యనారాయణ మూర్తి పరిశీలించారు. త్వరలోనే పనులు ప్రారంభించి ప్రజలకు సురక్షిత మంచినీటిని కుళాయిల ద్వారా అందించనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో కేజేపురం వైఎస్సార్‌సీపీ నాయకుడు చీపురపల్లి గోవింద తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వర స్వామి ఉత్సవాలు



గౌరీపరమేశ్వరస్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

గొలుగొండ: రావణాపల్లి గ్రామంలో శనివారం గౌరీపరమేశ్వరస్వామి నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా ఈ ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ. స్వామి వారి ఊరేగింపు సందర్భంగా గ్రామంలో మహిళలు పెద్ద ఎత్తున సారెతో సాగనంపారు. పండగ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు చోద్యం పీఏసీఎస్ అధ్యక్షుడు కలిపర్తి పెద్దిరాజు, ఏఏసీ చైర్మన్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం



కొండలెక్కుతున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

రావికమతం: సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. మేజర్ పంచాయితీ కొత్తకోట గ్రామంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా.. ఎవరైనా లంచాలు అడుగుతున్నారా.. ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. తమ ప్రాంతంలో ఏదైనా ప్రభుత్వ భవనం నిర్మించాలని 1వ వార్డులో మహిళలు ధర్మశ్రీని కోరారు. కొత్తకోటలో శ్రీసాయి కళ్యాణి నాయీ బ్రాహ్మణ సంఘం భవన నిర్మాణం నిధుల లేమితో ఆగిపోయిందని.. నిధులు మంజూరు చేయాలని ఆ సంఘం నాయకులు మాణీలు, రమణాజి ఎమ్మెల్యేను కోరారు. ఎవరూ లేని తనకు కళ్లు కూడా సరిగా కన్పించవని పింఛన్ మంజూరు చేయాలని, రేషన్ కూడా అందడం లేదని కొసిరెడ్డి రాజిబాబు ఎమ్మెల్యేను కోరగా ఆయా సమస్యల పరిష్కారానికి ఆయన స్థానిక అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. స్థానిక అంగన్‌వాడీ సెంటర్‌లో పిల్లలకు వడ్డించే పోషకాహారాన్ని రుచి చూశారు. ఎంపీపీ పైల రాజు, వైస్ ఎంపీపీ దంట్ల వెంకటరమణ, భవాని ప్రసాద్, మండల సచివాలయ కన్వీనర్ జగన్నాథరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ సత్యదేవ, శీలం శంకర్రావు, గ్రామ ఉప సర్పంచ్ పందల దేవా, ఎంపీటీసీలు కుంచా లక్ష్మి, పూడి దేవా, పైల చినమ్మలు పాల్గొన్నారు.

కొండలెక్కి గ్రామ సందర్శన..

దారీ తెన్నూ లేని చలిసింగం గ్రామాన్ని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ శనివారం సందర్శించారు. మూడుకొండలెక్కి దిగారు. ప్రయాస పడి తమ గ్రామానికి వచ్చిన ఆయనకు అక్కడి గిరిజనులు హారతులు పట్టారు. గ్రామంలో సరైన రోడ్డు లేవని ఆ గ్రామ సర్పంచ్ వంజరి గంగరాజు, మాజీ సర్పంచ్ సత్యనారాయణ ఆయనకు మొరపెట్టుకున్నారు. 90 రోజుల్లో రోడ్డు నిర్మిస్తామని ధర్మశ్రీ వారికి హామీ ఇచ్చారు. ఆ గ్రామానికి ఎస్‌డీపీ నిధులు రూ.31 లక్షలతో మంచినీటి సౌకర్యం కల్పించారు. చీకాయపాడు నుంచి ప్రత్యేక మోటార్లతో పైపులైన్ల ద్వారా చలిసింగం గ్రామానికి కొన్ని కుళాయిలు ఏర్పాటు చేశారు. వాటిని ధర్మశ్రీ శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఎంపీపీ పైల రాజు, వైస్ ఎంపీపీ దంట్ల వెంకటరమణ, మత్స భవానీప్రసాద్ పాల్గొన్నారు.

శ్రీ గౌరీపరమేశ్వరుల ఉత్సవం ప్రారంభం



శోభాయాత్రను ప్రారంభిస్తున్న సర్పంచ్ బాబులు

రోలుగుంట: మండలంలోని కె.నాయుడుపాలెం గ్రామంలో శ్రీ గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ గుములూరి బాబులు ప్రారంభించి మాట్లాడారు. భజనలు, కోలాటం తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఆధ్యాత్మికతను నింపుతాయన్నారు. సమరసిత సేవా ఫౌండేషన్ సౌజన్యంతో రోలుగుంట, నర్సీపట్నం మండలాల స్థాయిలో మహిళలకు భజన పోటీలు ఏర్పాటు చేశామన్నారు. ఆసక్తి ఉన్నవారు పాల్గొని ప్రతిభ చూపాలన్నారు. స్థానిక హనుమాన్ గుడి నుంచి భజన సమ్మేళనంతో వైఎస్సార్ విగ్రహం వరకూ మహిళా బృందాలు జెండాలతో ప్రదర్శనగా వచ్చారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం కావాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో జయమాధవి

నర్సీపట్నం: జగనన్న ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో జయమాధవి లబ్ధిదారులకు సూచించారు. మండలంలో చెట్టుపల్లి పంచాయతీలోని జగనన్న లేఅవుట్‌ను ఎంపీడీవో పరిశీలించారు. వారం వారం ఇళ్ల పురోగతిని పరిశీలిస్తామన్నారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆమె వెంట హౌసింగ్ ఏఈ నాయకుడు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

చమ్మచింత హైస్కూల్ భోజనం నిర్వాహకుల తొలగింపు



చమ్మచింత హైస్కూల్లో మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న ఎంఈవో అమృత్‌కుమార్

నాతవరం: మధ్యాహ్న భోజనం పథకం నిర్వాహకులు మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టకపోవడంతో వారిని తొలగిస్తున్నామని ఎంఈవో తాడి అమృత్‌కుమార్ తెలిపారు. మండలంలో చమ్మచింత హైస్కూల్లో మధ్యాహ్న భోజనం అందజేస్తున్న తీరుపట్ల గ్రామపెద్దలు వైస్ ఎంపీపీ మైనం శ్రీనాగగోపి, ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై తక్షణం విచారణ చేయాలని ఎంఈవో అమృత్‌కుమార్‌కు ఆదేశించారు. ఎంఈవో శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లితండ్రులను విచారించారు. విచారణలో విద్యార్థులు చెప్పినట్లు మెనూ సక్రమంగా అమలు కావడంలేదని, అన్నం జావలా ఉంటుందని వెల్లడైంది. దీనిపై ఎంఈవో భోజనం నిర్వాహకులను ప్రశ్నించగా.. తాము అధికారులు చెప్పిన విధంగా వంటలు చేయలేమని.. కొత్తగా ఎవరినైనా నియమించుకోమని వారు తెలిపారు. దీంతో వారిని తొలగించి కొత్త వారిని నియమించాలని తీర్మానించారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కిరణ్‌కుమార్, విద్యా కమిటీ చైర్మన్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి



గృహసారథులకు కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్, కొండా రాజీవ్‌గాంధీ

నర్సీపట్నం: ఇంటింటికీ వెళ్ళి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు ఆ కుటుంబం పొందిన లబ్ధిని వివరించాలని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పేర్కొన్నారు. శనివారం గొలుగొండ మండలానికి చెందిన వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని అమలు చేస్తున్న పథకాలు అర్హులందరికీ అందేలా వలంటీర్లు, కన్వీనర్లు, గృహసారథులు పర్యవేక్షించాలన్నారు. ఈ నెల 11 నుంచి డోర్ టూ డోర్ కార్యక్రమం చేపట్టి ప్రజల్లోకి వెళ్లాలన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ మాట్లాడుతూ మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అనేక అక్రమాలకు పాల్పడి నర్సీపట్నాన్ని సర్వనాశనం చేస్తే, ఎమ్మెల్యే గణేష్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారన్నారు. 2024లో పార్టీ విజయమే లక్ష్యంగా వలంటీర్లు, కన్వీనర్లు, గృహసారథులు సైనికుల్లా పని చేయాలన్నారు. అనంతరం గృహసారథులకు కిట్లు పంపిణీ చేశారు. ఏఎంసీ చైర్మన్ చిటికెల భాస్కర్‌నాయుడు, ఎంపీపీ మణికుమారి, మండల పార్టీ అధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు లోచల సుజాత, వైస్ ఎంపీపీలు జక్కు నాగమణి,సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రికి బెడ్ షీట్ల వితరణ




బెడ్‌షీట్లు అందజేస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

నర్సీపట్నం: ఏరియా ఆస్పత్రికి రోటరీక్లబ్ ప్రతినిధులు 50 బెడ్ షీట్లను అందజేశారు. క్లబ్ ప్రతినిధులు ఇన్‌కమింగ్ గవర్నర్ సుబ్బారావు, ట్రైనర్ ఎంవీ ప్రసాద్ చేతుల మీదుగా ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎం.నీలవేణిదేవికి బెడ్‌షీట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌కమింగ్ అసిస్టెంట్ గవర్నర్ పచ్చిగోళ్ల నారాయణరావు, క్లబ్ సెక్రటరీ నాగేంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

కొమిర, గుడివాడల్లో అగ్నిప్రమాదం

రావికమతం: కొమిర గ్రామానికి చెందిన కాకి లోవ కళ్యాణి పూరిల్లు శనివారం ఉదయం దగ్ధమయింది. ఈ ప్రమాదంలో ఇంట్లోని గృహోపకరణాలతో పాటు ధాన్యం వగైరా కాలి బూడిదయ్యాయి. ప్రమాదంలో రూ.లక్షకు పైగా ఆస్తినష్టం వాటిల్లింది. అలాగే గుడివాడ గ్రామానికి చెందిన డీఎస్ఎన్ రాజుకు చెందిన పదెకరాల్లోని టేకు, జీడిమామిడి తోటలు అగ్నిప్రమాదంలో దగ్ధమై ఆయనకు రూ.లక్షల్లో నష్టం వాటిల్లింది. రావికమతం అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు.

విశాఖలో చికిత్స పొందుతున్న ఇద్దరికి పింఛన్ల పంపిణీ



గొర్లె సూరిబాబుకు పింఛన్ అందజేస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్: మండలంలో సాగరం పంచాయితీకి చెందిన ఇద్దరు వ్యక్తులకు విశాఖలో శనివారం పింఛన్లు అందజేశారు. సాగరం పాత గ్రామానికి చెందిన దివ్యాంగుడు గొర్లె సూరిబాబు గత కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ విశాఖ కింగ్‌జార్జి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతనికి వెల్ఫేర్ సెక్రటరీ గెంజి త్రినాథ్ వెళ్లి పింఛన్ అందజేశారు. అలాగే కంచరపాలెంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వంజువంజుల రామన్నదొరకు కూడా వృద్ధాప్య పింఛన్ అందజేశారు. దీంతో వారిద్దరు కృతజ్ఞతలు తెలిపారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మాడుగుల: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు అన్నారు. శనివారం మాడుగులలో సుమారు రూ. 12 లక్షలతో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం-1 ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. నిరుపేద చిన్నారులకు పోష్టికాహారంతో పాటు చిన్ననాటి నుండి ఆంగ్ల బోధన అందించటమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం అన్నారు. ఎంపీపీ వేమవరపు రామధర్మజ, సర్పంచ్ ఎడ్ల కళావతి, ఓఎస్‌డీ ఎం. పోలినాయుడు, పంచాయితీ కార్యదర్శి సీహెచ్ నాయుడు, ఎంపీటీసీలు పోలిమేర విజయలక్ష్మి, కుక్కర మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్యాధికారిగా రామ్మోహన్‌రావు

మాకవరపాలెం: పశు వైద్యాధికారిగా రామ్మోహన్‌రావు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి వైద్యుడు బదిలీ అయి ఏడాది పైగా అయింది. దాంతో ఇప్పటి వరకు రాచపల్లి వైద్యాధికారి ఇన్‌చార్జిగా వ్యవహరించారు. అయితే ఈ స్థానంలో రామ్మోహన్‌రావును నియమించడంతో శనివారం ఆయన విధుల్లో చేరారు.

అక్రమంగా తరలిస్తున్న ఇసుక సీజ్

చోడవరం రూరల్ : అక్రమంగా ఇసుకను లారీ ద్వారా తరలిస్తుండగా ముందుగా అందిన సమాచారం మేరకు పోలీసులు పట్టుకున్నారు. చోడవరం హెడ్ కానిస్టేబుల్ రాము మండలంలోని ముద్దుర్తి గ్రామం జంక్షన్ వద్ద నంబారు చంద్రశేఖర్ తన లారీలో రెండు యూనిట్ల ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నట్లు సీఐ శ్రీనివాసరావు చెప్పారు. లారీని సీజ్ చేసి ఇసుకతో పాటు చోడవరం పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

మాకవరపాలెం: జగనన్న కాలనీల్లో లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీవో అరుణశ్రీ సూచించారు. మండలంలోని గిడుతూరు, తామరం, మాకవరపాలెంలోని లేఅవుట్లలో ఆమె శనివారం అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఇప్పటికీ నిర్మాణాలు ప్రారంభించని వారు వెంటనే చేపట్టాలన్నారు. నిర్మాణ స్థాయిని బట్టి ప్రభుత్వం బిల్లులు మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ రామలింగస్వామి, విద్యుత్‌శాఖ ఏఈ బాలకృష్ణ పాల్గొన్నారు.

హుండీ దొంగల పట్టివేత

బుచ్చెయ్యపేట : బుచ్చెయ్యపేట మండలంలో మూడు గ్రామాల ఆలయాల్లో హుండీల దొంగతనానికి పాల్పడిన వారిని పట్టుకున్న పోలీసులను అనకాపల్లి డీఎస్పీ సునీల్ అభినందించారు. శనివారం ఆయన బుచ్చెయ్యపేటలో వివరాలను విలేకరులకు వెల్లడించారు. ఈ నెల రెండో తేదీ అర్ధరాత్రి బుచ్చెయ్యపేట, దిబ్బిడి, కొండపాలెం గ్రామాల్లో ఆంజనేయస్వామి, మోదకొండమ్మ, మరిడిమాంబ, పరదేశమ్మ ఆలయాల్లో గుర్తు తెలియని వ్యక్తులు హుండీలను పగలగొట్టి దొంగతనానికి పాల్పడ్డారన్నారు. దొరికిన ఆధారాల ద్వారా రోలుగుంట మండలం జె నాయుడుపాలేనికి చెందిన నలుగురు వ్యక్తులు ఈ దొంగతనాలకు పాల్పడినట్లు గుర్తించామన్నారు. పడాల సతీష్‌కుమార్, మరిసా శ్యామ్‌కుమార్, బలిరెడ్డి జనార్దన్‌లతో పాటు మైనర్ బాలుడు ఉన్నట్లు గుర్తించి అరెస్ట్ చేశామన్నారు.

గౌరీశ్వరాలయం అభివృద్ధికి రూ. లక్షా 25 వేలు విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

చోడవరం: ప్రాచీన దేవాలయమైన శ్రీ స్వయంభూ గౌరీశ్వరస్వామి ఆలయం అభివృద్ధి పనులకు అల్లిఖానుడుపాలేనికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త సీహెచ్ అంజినిచౌదరి, జి. రామ్‌నాథ్ చౌదరి తమ వంతుగా రూ. లక్షా 25 వేలు విరాళంగా ఇచ్చారు. ఈ మొత్తాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పప్పల జయదేవ్, ట్రస్టుబోర్డు చైర్మన్ గూనూరు సత్తిబాబుకు దాతలు అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు కొడమంచిలి చలపతిరావు పాల్గొన్నారు.